# మన 'వే'మన పద్యములు

వేమన పద్యాలు ఆటవెలది పద్యాలు. నేర్చుకోవడము చాలా తేలిక. వేమన ఆటవెలది వృత్తములో మొదటి మూడు పాదాలలో చెప్పదలచుకున్న విషయము ఉదాహరణతో సహా ఇముడుతుంది. నాలుగవ పాదము చాలావరకు "విశ్వదాభిరామ వినురవేమ!"తో ముగుస్తుంది. ఈ పద్యాలు మన సంఘానికి సంబంధించిన పద్యాలే, మన పద్యాలే. చెప్పదలచుకున్న విషయము ఇంత సూటిగా బహుశా మరెవరూ చెప్పలేదేమో! ఈ సంచిక నుండి ప్రతిసారీ రెండు పద్యాలు, వాటి భావము అందించే ప్రయత్నము చేస్తున్నాము. మీ పిల్లలకి నేర్పడము మరువకండి.

వేరిపురుగు చేరి వృక్షంబు చెరచును
చీడపురుగు చేరి చెట్టు చెరచు
కుత్సితుండు చేరి గుణవంతు చెరచురా
విశ్వదాభిరామ వినురవేమ!

వేరులను తినే పురుగులు వృక్షపు వేళ్ళను తిని వృక్షన్ని నిలువునా ఎండిపోయేటట్లు చేస్తాయి. చెట్లకు చీడపురుగులు పట్టి ఆకులను, పువ్వులను, పండ్లను నాశనము చేస్తాయి. కావున ఆ పురుగులను రాకుండా నివారించడమే తరుణోపాయము. అలాగే దుర్జనుని సావాసము వలన నీతిమంతుడు కూడా చెడిపోయే ప్రమాదము ఉండడము వలన, వారి సావాసము వీడుటే శ్రేయస్కరము.

వ్రాతవెంటగాని వరమీడు దైవంబు
చేతకొలది గాని వ్రాత కాదు
వ్రాత కజుడు కర్త చేతకుతాకర్త
విశ్వదాభిరామ వినురవేమ!

మన తలరాతను బట్టిగానీ దేవుడు వరమివ్వడు. మన తలరాత ఎలా బాగుపడుతుంది? మనము చేసే కర్మలవలన. అనగా మనము మంచి పనులు చేస్తూ వుంటే మన తలరాత బాగుపడుతుందన్నమాట. మన తలరాత రాసేవాడు (తలరాతకు కర్త) కజుడే (బ్రహ్మ) అయినా, మనము చేసే పనులకు మనమే బాధ్యులము కదా!